క్లుప్తంగా

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న బాబూరావు

ఒంగోలు టౌన్: నగరంలో అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలివ్వాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో ఒంగోలు నగర, చీమకుర్తి పట్టణ సీపీఎం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చీకటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, బాబూరావు ప్రసంగించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

మూడు రాష్ట్రాల్లో బీజేపీ విజయంతో వేడుకలు



చర్చి సెంటర్‌లో నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు

ఒంగోలు సెంట్రల్: దేశంలోని నాలుగు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఆదివారం వెలువడిన ఫలితాల్లో మూడు రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు ఉత్సవాలు నిర్వహించారు. బీజేపీ ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ యోగయ్య యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక చర్చిసెంటర్లో, ఇంకా పలు చోట్ల స్వీట్లు పంపిణీ చేశారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్‌లో విజయం, తెలంగాణ ఎన్నికల్లో మంచి ఓటింగ్ శాతం సంపాదించడంపై హర్షం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి నరేంద్రమోదీ ప్రధాని కావడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఒంగోలు పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సాగర తీరాన రోటరీ క్రీడా మహోత్సవం

చీరాల అర్బన్: రామాపురం బీచ్‌లో పెరల్ రిసార్ట్స్‌లో ఆదివారం రోటరీ జిల్లా స్థాయి సాగరతీర క్రీడా మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని డిస్ట్రిక్ట్ గవర్నర్ బూసిరెడ్డి శంకర రెడ్డి ప్రారంభించారు. ఉదయం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన కార్యక్రమం రాత్రి వరకు ఆట, పాటలతో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో సాగింది. ఆటల్లో గెలుపొందిన వారికి బహుమతులు, లక్కీ డిప్‌లో గెలుపొందిన వారికి కూడా బహుమతులు అందించారు. కార్యక్రమంలో మామిడాల శ్రీనివాసరావు, చీరాల కృష్ణమూర్తి, జీవై ప్రసాద్, డివి సురేష్, డాక్టర్ ఐ.బాబూరావు, పోలుదాసు రామకృష్ణ, బి.హేమంత్‌కుమార్ రోటరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి



దివ్యాంగులకు బహుమతులు అందిస్తున్న సంఘ సభ్యులు



ఒంగోలులోని గుడ్ న్యూస్ దివ్యాంగ పాఠశాలలో పండ్లు, కేక్ అందుకుంటున్న దివ్యాంగులు



చీమకుర్తిలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం...

ఒంగోలు సెంట్రల్: దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ బీవీ సాగర్ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక కర్నూలు రోడ్డులోని గుడ్ న్యూస్ దివ్యాంగ పాఠశాలలో కేక్ కట్ చేసి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. పండ్లు పంపిణీ చేశారు. దివ్యాంగులకు హక్కులు–చట్టాలపై అవగాహన కల్పించారు. క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. వీపీఏ అక్క, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక సంతపేటలోని ప్రభుత్వ దివ్యాంగుల బాలుర వసతి గృహంలో ఆదివారం వాసవీ క్లబ్ సిటిజన్ అధ్యక్షుడు చీదేళ్ల వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దివ్యాంగుల్లో మనోధైర్యాన్ని నింపేందుకు వాసవీ క్లబ్ సభ్యులు సందేశాన్నిచ్చారు. పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వెంకట ప్రసాద్, నగేష్ గుప్తా, కోశాధికారి భూమా శ్రీనివాసులు, రీజియన్ చైర్మన్ చంద్రశేఖర్, జోన్ చైర్మన్ చలువాది సత్యనారాయణ, పలువురు బాధ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి: చీమకుర్తి మెప్మా కార్యాలయంలో ఆదివారం పట్టణ దివ్యాంగుల సమాఖ్య అధ్యక్షుడు షేక్ మహ్మద్ రఫీ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. జగనన్న ఫౌండేషన్ అధ్యక్షుడు వారా వీర్రాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగులకు ప్రభుత్వం రూ.6 వేల పింఛను అందించాలని, ఎలాంటి షరతులు లేకుండా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని, ఒంటరి దివ్యాంగులకు వైట్ రేషన్ కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తొలుత విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కేకు కట్ చేశారు. అనంతరం రఫీని శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో బత్తుల మల్లికార్జున, మద్దాళి మాధవరావు, పలువురు దివ్యాంగులు పాల్గొన్నారు.

ఓటర్ల నుంచి 1,211 క్లెయిమ్‌లు



చీమకుర్తిలో ఓటర్ల క్లెయిమ్‌లను పరిశీలిస్తున్న తహసీల్దార్ మధుసూదన్‌రావు

చీమకుర్తి: సంతనూతలపాడు నియోజకవర్గంలో రెండు రోజుల పాటు పోలింగ్ బూత్‌లలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో ఓటర్ల నుంచి మొత్తం 1,211 క్లెయిమ్‌లను బీఎల్ఓలు స్వీకరించినట్లు చీమకుర్తి తహసీల్దార్ పీ మధుసూదన్‌రావు తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 2, 3 తేదీల్లో ప్రత్యేకంగా ఓటర్ల నుంచి ఫారం–6, 7, 8లను స్వీకరించే కార్యక్రమాలు నిర్వహించారు. సంతనూతలపాడు నియోజకవర్గంలోని చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల్లో మొత్తం 256 పోలింగ్ స్టేషన్ల నుంచి ఫారం–6, 7, 8లను ఓటర్ల నుంచి స్వీకరించారు. వాటిలో నూతనంగా ఓటర్ల చేర్పులకు సంబంధించి ఫారం–6లు 421, తొలగింపులకు సంబంధించి ఫారం–7లు 166, సవరణలకు సంబంధించి ఫారం–8లు 624 కలిపి మొత్తం 1,211 స్వీకరించినట్లు తహసీల్దార్ వివరించారు. చీమకుర్తి మండలంలోని పలు పోలింగ్ బూత్‌లను పరిశీలించి బీఎల్ఓల వద్ద ఉన్న ఫారాలను పరిశీలించారు.

ప్రభుత్వ ప్రోత్సాహం అందించాలి



మాట్లాడుతున్న వెంగళరావు

ఒంగోలు: కులాంతర వివాహం చేసుకున్న వారికి ప్రభుత్వం తక్షణమే ప్రోత్సాహం అందించాలని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కోలాస్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జీవో నంబర్ 50లో సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ఓసీ మహిళలను వివాహం చేసుకున్న ఇతర కులాల పురుషులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకం మంజూరు చేసేలా జీవోను సవరించాలన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్నవారికి ఇంటి స్థలం మంజూరుతోపాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. వ్యవసాయ భూమి, ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యత కల్పించడంతోపాటు వివాహాలు చేసుకున్నవారికి రక్షణ కల్పించాలన్నారు. కులాంతర వివాహాల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దుగ్గిరాల విజయ్‌కుమార్, దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు సంపత్‌కుమార్, గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుబ్బారావు, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు జంగ్రాజుపల్లి ఆంజనేయులుమాదిగ పాల్గొని ప్రసంగించారు.

నిరుపేద కుటుంబాల పిల్లలకు ఉచిత వైద్యం



మెడికల్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న వినుకొండయ్య

కొత్తపట్నం: నిరుపేద కుటుంబాల పిల్లలకు ఉచిత వైద్యంతో పాటు మందులు కూడా పంపిణీ చేస్తున్నామని డాక్టర్ చేపల వంశీకృష్ణ తెలిపారు. ఒంగోలు శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపట్నంలోని శ్రీవాణి విద్యానికేతన్ స్కూల్ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎముకలు, కీళ్లు, నరములు, స్త్రీల సమస్యలు, గర్భిణుల సమస్యలు, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ సమస్యలు, దగ్గు, నెమ్ము, ఆయాసం, చాతి, ఊపిరి తిత్తుల వ్యాధులు, చిన్నపిల్లలు, ఈఎన్‌టీ, దంత సమస్యలు, బీపీ, సుగరు, థైరాయిడ్ మొదలగు అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో డాక్టర్ సున్నపు విజయ్‌కుమార్, డాక్టర్ సోనల్ ధీరజ్ బాబు, నాగిడి కుమార్‌వర్మ, డాక్టర్ హరికృష్ణ ప్రసాద్ పాల్గొని వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. శ్రీవాణి విద్యానికేతన్ కరస్పాండెంట్ చాపల కోటేశ్వరరావు, వినుకొండయ్య, మహేంద్ర కుమార్‌వర్మ, ప్రదీప్‌వర్మ, పట్టపు ప్రకాశం, హాస్పిటల్ మేనేజర్ సుధాకర్, రవి, నాగరాజు, సూపర్‌వైజర్ కొక్కిలగడ్డ శ్రీను, మాల్యాద్రి పున్నయ్య, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

త్రిపురాంతకేశ్వర స్వామికి వెండి నామం



వెండి నామాలతో త్రిపురాంతకేశ్వరుడు

త్రిపురాంతకం: పార్వతి సమేత త్రిపురాంతకేశ్వర స్వామి వారి ఆలయానికి వెండి నామాన్ని భక్తుడు పవన్ కుమార్ శాస్త్రి అందజేశారు. త్రిపురాంతకం త్రిపురాంతకేశ్వరస్వామికి అలంకరించే జాతి రాళ్లతో పొదిగిన వెండి నామాన్ని శృంగేరి పీఠం మహాస్వామి ఆశీస్సులతో దీనిని ప్రత్యేకంగా తయారు చేయించి అందించినట్లు పవన్ కుమార్ శాస్త్రి తెలిపారు. ఈ ఆభరణానికి సంప్రోక్షణ చేసి విశేష అభిషేకం అనంతరం స్వామికి అలంకరించారు.

వర్షం నీరు నిలవకుండా చర్యలు



కాలువల్లో చెట్లను తొలగిస్తున్న జేసీబీ

ఒంగోలు టౌన్: మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో రోడ్లపై వర్షం నీరు నిలవకుండా నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదివారం ప్రత్యేక చర్యలు చేపట్టారు. నగరంలో విస్తృతంగా పర్యటించి అధికారులు, సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. పోతురాజుకాలువలో మురుగు నీరు కలిసేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఇంజినీరింగ్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బందికి సూచించారు. గాలులకు రోడ్లు, కాలువలపై అడ్డుపడిన చెట్లను జేసీబీ సహాయంతో తొలగించడానికి చర్యలు తీసుకున్నారు. వెంకటేశ్వరకాలనీ, చైతన్య కాలేజీ, పేర్నమిట్ట, బలరాం కాలనీ, పోతురాజు కాలువ, రిమ్స్ కాలేజీ ఎదురుగా ఉన్న కాలువల వద్ద పారిశుద్ధ్య పనులను కమిషనర్ పర్యవేక్షించారు. తుఫాన్ వల్ల ఏదైనా ఇబ్బందులు ఎదురైతే తక్షణమే చర్యలు తీసుకునేందుకు ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ప్రజలు ఇబ్బంది ఎదురైతే టోల్ ఫ్రీ నంబర్ 08592 227799కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మిచాంగ్ తుఫాన్‌పై అప్రమత్తం



కొత్తపట్నం బీచ్‌లో ఎగసిపడుతున్న అలలు

కొత్తపట్నం: మిచాంగ్ తుఫాన్‌పై కొత్తపట్నం తీరం ప్రాంత ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తమయ్యారు. కె.పల్లెపాలెం, గుండమాల, పిన్నింటివారిపాలెం, మడనూరు, రాజుపాలెం, ఈతముక్కల తీర ప్రాంతాలకు ఆదివారం అధికారులు వెళ్లి బోట్లు, వలలు, ఇంజిన్లను మెరక ప్రాంతానికి తరలించాలని మత్స్యకారులకు సూచించారు. మెరైన్ పోలీసులు మైక్ ద్వారా సముద్రంలోకి చేపల వేటకు ఎవరూ వెళ్లవద్దని ప్రచారం చేశారు. దీంతో మత్స్యకారులు సముద్రంలో లంగర్లు వేసిన బోట్లను మెరక ప్రాంతాలకు తీసుకొచ్చారు. ఆదివారం నుంచి మూడు మీటర్ల ఎత్తులో సముద్రంలో అలలు ఎగసి పడుతున్నాయి. అలల తీవ్రతకు సముద్రం ఎర్రబారింది. సముద్రం ఇరవై మీటర్ల దూరం ముందుకొచ్చినట్లు మత్స్యకారులు తెలిపారు. అలల ఉధృతికి సముద్రం కోతకు గురైంది. చిన్నపిల్లలు, బాలింతలు, గర్భిణులను గుర్తించి వారు అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. సోమ, మంగళవారాలు ఇంటి నుంచి బయటకు రావద్దని హెచ్చరికలు జారీ చేశారు.

భూ కబ్జా చేయలేదు



డాక్యుమెంట్లు చూపుతున్న సిరాజ్

మార్కాపురం టౌన్: తాను ఎవరి పొలాన్ని కబ్జా చేయలేదని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ మొఘల్ సిరాజ్ తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. గోగులదిన్నెలో మందటి శివారెడ్డి పొలాన్ని ఆక్రమించినట్లుగా తనపై దురుద్దేశంతో పోలీసు కేసు పెట్టారని ఇందులో వాస్తవం లేదని తెలిపారు. ఆ పొలాన్ని తాను చట్టబద్ధంగానే కొనుగోలు చేశానని ఎక్కడా భూమిని ఆక్రమించలేదని, దౌర్జన్యానికి పాల్పడలేదని తెలిపారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే తనపై తప్పుడు కేసు పెట్టారని సిరాజ్ తెలిపారు. శివారెడ్డి అనే వ్యక్తి తనకు తెలియదని ఎప్పుడూ కలవలేదని, కానీ తన భూమి అంటూ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. తన వద్ద అన్ని డాక్యుమెంట్లు ఉన్నాయని, పోలీసు విచారణలో వాస్తవాలు తెలుస్తాయన్నారు.

యాదాద్రిలో శ్రీగిరి ఆలయ నిర్వాహకుల పూజలు

ఒంగోలు మెట్రో: ఒంగోలు కొండమీద గల శ్రీగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, శ్రీగిరి ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ్ రాజీవ్ ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా ఆదివారం ప్రఖ్యాత పుణ్యక్షేత్రం యాదాద్రిలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కురిచేడు: శివలింగాకారంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కంభం చెరువుపై శివాభిషేకంలో పాల్గొన్న భక్తులు



వనభోజనాల్లో పాల్గొన్న బ్రాహ్మణులు

భక్తి శ్రద్ధలతో లక్ష బిల్వార్చన

కురిచేడు: కార్తీక మాసం సందర్భంగా మండల బ్రాహణ సంఘం ఆధ్వర్యంలో 29వ లక్ష బిల్వార్చన కార్యక్రమం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి బ్రాహ్మణులు, వేదపండితులు వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయంలో శ్రీ కాళహస్తీశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ మహారుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన కార్యక్రమం వేదపండితుల వేదమంత్రోచ్చరణతో నిర్వహించారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: పట్టణ పరిసర గ్రామ ప్రజల గ్రామదేవత అల్లూరి పోలేరమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ ప్రజలతో పాటు వేముల కోట, సీతనాగులవరం, రామచంద్రపురం తదితర గ్రామాల నుంచి భక్తులు కుంకుమ బండ్లు కట్టుకుని వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. మహిళ భక్తులు అమ్మవారికి చీర, గాజులను సమర్పించారు. సమీపంలో ఉన్న నాగ శిలలకు, నాగమయ్య పుట్టకుపాలుపోసి పూజలు చేశారు. ఈవో ఈ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమ పూజలు, అఖండహారతి పూజలు చేశారు.

కంభం: కాకతీయ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం చారిత్రాత్మక కంభం చెరువుకట్టపై కార్తీక వనభోజన మహోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 58 మంది దంపతులతో శివాభిషేకం నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు కొండయ్య మాట్లాడుతూ కమ్మ సంఘీయులు ఐక్యమత్యంగా ఉండి సమాజ సేవలో భాగస్వామ్యులు కావాలన్నారు. ముప్పవరపు వెంకట్రావు, చప్పిడి మధు, సత్యనారాయణ, సురేష్, రమేష్, గని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కురిచేడు: శ్రీ జ్ఞానప్రసూనాంబ మాత మూల విరాట్



మార్కాపురం: ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ అమ్మవారు



బేస్తవారిపేట: ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి



ప్రత్యేక అలంకరణలో గంగాభవాని అమ్మవారు

తాళ్లూరు (ముండ్లమూరు): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన గుంటి గంగాభవాని అమ్మవారికి భక్తులు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు విజయలక్ష్మీ, ప్రకాశరావు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి భక్తులు 3 చీరలు బహూకరించారు. ఆలయ ఆదాయం 3150 రూపాయలు వచ్చినట్లు ఈఓ కార్తీక్ తెలిపారు. భక్తులు సోమయ్య, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆర్‌ఏ శ్రీనివాసరావు భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

ఉత్సాహంగా బ్రాహ్మణ కార్తీక వన భోజనాలు

మార్కాపురం: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణశివార్లలోని గంగా పార్వతీ సమేత చంద్రమౌళీశ్వర దేవస్థానంలో కార్తీక బ్రాహ్మణ వనభోజనాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. నిర్వాహకులు ఓరుగంటి సుబ్రమణ్యం, శివుడు, వెలుగొండ ప్రాజెక్టు డిప్యూటీ తహసీల్దార్ రమణ, ఎస్. శాస్త్రి, హరిప్రసాద్, కమలపూరి శ్రీనివాస్, కె. మయి, డి. మధు తదితరులు పాల్గొన్నారు. బ్రాహ్మణులందరూ ఐక్యంగా ఉండాలని కోరారు.

అంకాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

గిద్దలూరు రూరల్: మండలంలోని కె.ఎస్.పల్లెలో అంకాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించారు. కార్తీక దీపాలను వెలిగించి.. భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.